క్లుప్తంగా

దుష్ప్రచారాన్ని సహించేది లేదు

మణుగూరురూరల్: ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ కమిటీపై యూనియన్‌కు సంబంధం లేని కొంతమంది వ్యక్తులు దుష్ప్రచారం చేస్తున్నారని, దీనిని సహించేది లేదని సంఘం బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వత్సవాయి కృష్ణంరాజు అన్నారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏరియాలో కొంతమంది వ్యక్తులు కాంగ్రెస్ పార్టీ, అనుబంధ ఐఎన్‌టియుసి, స్థానిక ఎమ్మెల్యే పేరుతో దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. అలాంటి సమాచారాన్ని కార్మికులు, ప్రజలు నమ్మి మోసపోవద్దన్నారు. అటువంటి వారి పట్ల సింగరేణి, కాంట్రాక్ట్, ఓబీ కార్మికులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో ఐఎన్‌టియుసి నాయకులు సిల్వేరు గట్టయ్య, సూరపాక రాములు, బండారి జయరాజు, మిద్దెపాక శ్రీనివాస్, పిట్ కార్యదర్శులు తాళ్లూరి రాము, రామకృష్ణ, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ప్రశంసలతో ఉద్యోగానికి సార్థకత

దుమ్ముగూడెం: గిరిజన విద్యార్థినీ విద్యార్థులను కన్నబిడ్డల్లాగా చూసుకుని, అధికారుల చేత ప్రశంసలు పొందినప్పుడే చేసిన ఉద్యోగానికి సార్థకత లభిస్తుందని భద్రాచలం ఏటీడీఓ నరసింహారావు అన్నారు. ఆదివారం మండలంలోని మంగువాయి బడవ బాలికల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో కామాటిగా విధులు నిర్వహించి ఉద్యోగ పదవి విరమణ పొందుతున్న కల్లూరి నీలమ్మ సన్మాన ఉత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీలమ్మ మంగువాయి బడవలో పాఠశాల నిర్మాణం కోసం ఎకరం స్థలం దానం చేసి, గిరిజన విద్యార్థుల సంక్షేమానికి కృషిచేసిందని అన్నారు. గురుకులం ఏట‌ఓ కృష్ణార్జున, హెచ్‌ఎం వీర కుమారి, సర్వేశ్వర దొర, నారాయణ, రంగయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన దేవమ్మ సంబురాలు



గంగ స్నానం అనంతరం సోమాల దేవమ్మను ఆలయానికి తీసుకొస్తున్న పూజారులు

చర్లరూరల్: సకాలంలో వర్షాలు కురిసి పంటలు మంచిగా పండాలని, అందరూ సంతోషంగా ఉండాలని ఎన్నో ఏళ్లుగా మండలంలోని పాతచర్ల గ్రామంలో సోమాల దేవమ్మ సంబురాలను ప్రజలు చేస్తూ వస్తున్నారు. ఈ సారి కూడా రెండు రోజులుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడో రోజు ఆదివారం ఎంతో భక్తి శ్రద్ధలతో, మేళ తాళాలతో గంగ స్నానమాచరించి తిరిగి ఆలయంలో నిలపడంతో సంబరాలు ముగిశాయి.

వైద్య సాయం

దమ్మపేట: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సరైన వైద్యం అందేలా స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చొరవ చూపారు. మండలంలోని రంగువారిగూడెం గ్రామానికి చెందిన చెప్పుల వెంకటేశ్వర్లు హృదయ సంబంధమైన మూడు వాల్స్ పూర్తిగా దెబ్బతినడంతో తీవ్రంగా బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారే, ఆదివారం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి, శస్త్ర చికిత్స చేయించారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ సీతారామ్ బృందం ఆ శస్త్ర చికిత్సను విజయవంతం చేశారు. మారప్పగూడెం గ్రామానికి చెందిన కొర్సా బొజ్జి, టీబీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, ఖమ్మం మమత ఆసుపత్రిలో వైద్యం అందేలా చొరవ చూపారు.

డీఎస్సీ వాయిదా వేయాలి

పినపాక: ప్రభుత్వం నిర్వహించే డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు శివప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏమాత్రం అవగాహన లేకుండా పరీక్షలు నిర్వహిస్తోందని అన్నారు. ఇటీవల నిర్వహించిన టెట్ పరీక్షల్లో సుమారు పదివేల మంది దాకా ఉత్తీర్ణులయ్యారని, వారిని దృష్టిలో ఉంచుకొని డీఎస్సీ పరీక్షలను మూడు నెలలు వాయిదా వేయాలని ప్రభుత్వానికి సూచించారు. లేదంటే విద్యార్థుల తరఫున పెద్ద ఎత్తున ధర్నాలు, పోరాటాలు చేస్తామన్నారు. వీటిపై హైదరాబాదులో పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తున్న ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సమస్యలపై సమావేశం

దమ్మపేట: దమ్మపేట గ్రామ పంచాయితీ పరిధిలోని ప్రధాన సమస్యలపై మల్లారంలోని రైతు వేదికలో ఆదివారం గ్రామ యువత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన యువత, పెద్దలు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రధాన సమస్యలైన గ్రంథాలయం, డ్రెయినేజీ వ్యవస్థ, ప్లాస్టిక్ వినియోగం తదితర అంశాలపై చర్చించారు. రాబోయే రోజుల్లో పార్టీలకతీతంగా ఇలాంటి సమావేశాలు ఏర్పాటు చేసుకుని, ప్రజా సమస్యలపై పోరాడాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ భవానికృష్ణ, పిట్టల నవీన్, లాలుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వాన

- ఉప్పొంగిన వాగులు, తెగిపోయిన దారులు
- పలు గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు
- వర్షంతో రైతుల్లో హర్షం



బూర్గంపాడు: మాగాణుల్లో చేరిన వర్షపునీరు



ములకలపల్లి: పాములేరు వాగు ఉధృతితో కోతకు గురైన డైవర్షన్ రోడ్డు

బూర్గంపాడు: మండల వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు వర్షం కురిసింది. ఆదివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షంతో చెరువులు, కుంటలలోకి నీరు చేరాయి. జూన్ నెలలో అడపా దడపా వర్షాలే తప్ప భారీ వర్షాలు కురవలేదు. ఆదివారం కురిసిన భారీ వర్షంతో వ్యవసాయ పనులు ఊపందుకోనున్నాయి. ఇప్పటికే రైతులు 90శాతం మేరా పత్తిగింజలు వేసుకోవటం పూర్తయింది. వరినార్లు, మిరప నార్లు పోసుకునేందుకు రైతులు సమయాత్తమవుతున్నారు. మరో రెండురోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ సూచిస్తుండటంతో రైతుల్లో హర్షమ్యక్తమవుతుంది.

అప్రోచ్ రహదారి ధ్వంసం..

అశ్వాపురం: మండలంలో శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండల పరిధిలోని తుమ్మలచెరువులో లోతువాగు, గొందిగూడెంలో ఇసుకవాగులు పొంగి ప్రవహించాయి. ఇసుకవాగు ప్రవాహంతో గొందిగూడెం, గొందిగూడెం కొత్తూరు, ఎలకలగూడెం, మనుబోతులగూడెం గ్రామ పంచాయతీల గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. ఇసుకవాగుపై వంతెన నిర్మాణం అర్ధాంతరంగా నిలిచింది. వంతెన నిర్మాణంతో గిరిజనుల రాకపోకలకు అప్రోచ్ రహదారి నిర్మించారు. ఇసుకవాగు ప్రవాహంతో అప్రోచ్ రహదారి కోతకు గురైంది. దీంతో గిరిజనులకు రాకపోకలు నిలిచాయి. కనీస సౌకర్యాలకు గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అత్యవసరం ఐతే గొందిగూడెం, తుమ్మలచెరువు, మొండికుంట మీదుగా 20 కిలోమీటర్లు ప్రయాణించి అశ్వాపురం వస్తూ గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. కొందరు గిరిజనులు ప్రమాదకరంగా రైలు పట్టాలపై రాకపోకలు సాగిస్తున్నారు. గత ఏడాది వర్షాకాలంలో కూడా వర్షాలకు అప్రోచ్ రహదారి పలుమార్లు కోతకు గురై గిరిజనులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. అప్రోచ్ రహదారి పకడ్బందీగా ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరినా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అప్రోచ్ రహదారి తూతూమంత్రంగా వేయడంతో కోతకు గురవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షాకాలంలో మూడు నెలల పాటు రాకపోకలకు ఇబ్బంది లేకుండా అప్రోచ్ రహదారిని బందోబస్తుగా నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

తెగిపోయిన డైవర్షన్ రోడ్డు..

ములకలపల్లి: ములకలపల్లి శివారులోని పాములేరు వాగుపై ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు తెగిపోయింది. దీంతో తాళ్లపాయ జీపీ కేంద్రంతోపాటు రింగిరెడ్డిపల్లి, బూర్గుకొయ్య గుంపు, మంగలిగుట్ట సుందర్‌నగర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ములకలకల్లి–తాళ్లపాయ గ్రామాల మధ్య పాములేరువాగుపై మినీబ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో నూతన వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. దీంతో పాత బ్రిడ్జిని పూర్తిగా కూల్చివేసి, వాగుపై తాత్కాలికంగా మోరీలు వేసి, డైవర్షన్ రోడ్డు నిర్మించారు. నూతన వంతెన పనులు మొదలుపెట్టారు. ఐతే శనివారం రాత్రి నుండి కురుస్తున్న వర్షానికి వాగు



అశ్వాపురం: గొందిగూడెంలో ఇసుకవాగు వద్ద కోతకు గురైన అప్రోచ్ రహదారి

పరవళ్లు తొక్కడంతో డైవర్షన్ రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. మోరీలు బయటపడ్డాయి. ఆదివారం రాత్రి వరకూ కూడా వాగుదాటే వీలులేకపోవడంతో మారుమూల గ్రామాల ప్రజలకు బాహ్యాప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.

వాగును దాటొద్దు..

పాములేరు వాగు డైవర్షన్ రోడ్డు కోతకు గురైన ప్రదేశాన్ని ఆర్ఐ తారాచంద్‌తో కలసి ఆదివారం తహసీల్దార్ గుడ్ల పుల్లారావు పరిశీలించారు ప్రవాహం అధికంగా ఉన్నందున ఎవరూ వాగు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, ఎస్సై రాజమౌళి సైతం వాగు ప్రాంతాన్ని సందర్శించారు. పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా బ్రిడ్జి నిర్మాణ పనులు సత్వరమే పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు నరాటి ప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వర్షాకాలం ఆరంభమైనా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంవల్లే పనులు అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తిస్తే గుర్తింపు

భద్రాచలంటౌన్: ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వహిస్తేనే అందరి మన్ననలు పొందడంతో పాటు గుర్తింపు లభిస్తుందని ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్ అన్నారు. స్థానిక ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగం బ్లూ ప్రింట్ ఆపరేటర్ నాగభూషణం ఆదివారం ఉద్యోగ విరమణ చేయగా జరిగిన సన్మాన సభలో ఆయన మాట్లాడారు. నాగభూషణం బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అంచలంచెలుగా ఎదుగుతూ సక్రమంగా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. అనంతరం నాగభూషణం దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈఈ



నాగభూషణం దంపతులను సన్మానిస్తున్న ఏపీఓ


తానాజీ, డీఈలు హరీష్, రామ్ రెడ్డి ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది లక్ష్మణ్, శంకర్, బాపనయ్య తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ప్రమాణ స్వీకారం

అశ్వాపురం: నిరుపేదలు, వృద్ధులు, రోగులు, విద్యార్థులు, అభాగ్యులకు సేవలు అందించేందుకు లయన్స్‌క్లబ్ ఆఫ్ అశ్వాపురం సేవలు మండల వ్యాప్తంగా విస్తరింపజేయాలని అశ్వాపురం ఎస్సై తిరుపతిరావు అన్నారు. లయన్స్‌క్లబ్ 2024–25 నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం రాత్రి మండల కేంద్రంలో ఓం శక్తి పంక్షన్ హాల్‌లో నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా మల్లెలమడుగు గ్రామానికి చెందిన న్యాయవాది సింగం శ్రీధర్, ఐఎంఎం పాస్ట్ ప్రెసిడెంట్‌గా ఆర్.సర్వేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కే.కొండలరావు, బీ.దేవేందర్, పీవీజీఎం.వర్మరాజు, సెక్రటరీగా సాధిక్‌పాషా, జాయింట్ సెక్రటరీగా కే.మహేష్, ట్రెజరర్‌గా కే.రామలింగేశ్వరరావుతో పాటు కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపతిరావు పాల్గొని అధ్యక్షుడు శ్రీధర్ దంపతులను సన్మానించి నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాదె కేశవరెడ్డి, సుంకరి సురేందర్, నర్సింహులు, కమటం నరేష్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.


ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం

భద్రాచలంటౌన్: తమ ఉద్యోగుల కుటుంబాల సంక్షేమమే లక్ష్యంగా ఆర్టీసీ సంస్థ పని చేస్తుందని భద్రాచలం డిపో మేనేజర్ రామారావు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో లక్షే లక్ష్యం అనే అంశంపై ఉద్యోగుల పిల్లలకు ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన అనూష, సౌమ్య, పుష్పరాజ్, సాయి, మన్వితలకు మేనేజర్ రామారావు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ గౌతమి, వెంకటేశ్వరరావు, అల్లం నాగేశ్వరరావు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డిపో మేనేజర్ రామారావు

కార్మికుల రక్షణకు చర్యలు తీసుకోవాలి



అండర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పీకేఓసీ టూ–2 కార్మికుల రక్షణకు, రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిల్వకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ రామనర్సయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఓసీ–2ను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నాయకులు సందర్శించి కార్మికులను వాస్తవ పరిస్థితులు అడిగి తెలుసుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్వారీకి వెళ్లే రోడ్లు బురదమయంగా మారుతున్నాయని కార్మికులు నడవలేని పరిస్థి ఉందని అన్నారు. 60టీ డంపర్ పార్కింగ్ దయనీయంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వాషింగ్ ప్లాంట్ వద్ద వాడిన బురద నీరు డ్రైనేజీ లేక ఎస్అండ్‌డీ పరిసరాల్లో బురదగా మారుతోందన్నారు. ఓసీ–2లో ఆర్‌ఓ ప్లాంట్ నిర్వహణ పట్టించుకోకపోవడంతో తాగునీరు కూడా లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేసీహెచ్‌పీ ట్రాక్ లైన్ పక్క రహదారి వెంబడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, చర్యలు చేపట్టాలని అన్నారు. మెయింటెనెన్స్ సెక్షన్లలో రెస్ట్ షెల్టర్ లేదని,. క్యాంటీన్ మెనూ పాటించడం, రెస్ట్ రూంల వద్ద అపరిశుభ్రత, సులభ్ కాంప్లెక్స్‌లో లైట్ల లేమితో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్రాంచి నాయకులు మేకల ఈశ్వర్, ఆదర్ల సురేందర్, శనిగరపు కుమారస్వామి, కోడి రెక్కల శ్రీనివాసరావు, పాపారావు పాల్గొన్నారు.

రేపు రైతు భరోసాపై సలహాల స్వీకరణ

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం సొసైటీ కార్యాలయంలో జూలై 2వ తేదీన రైతుభరోసా పథకంపై రైతుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించే కార్యక్రమం ఉంటుందని సొసైటీ అధ్యక్షుడు కిలిమి ఎల్లారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులందరూ సకాలంలో హాజరై తమ సలహాలు,సూచనలు అందించాలని కోరారు.

నేడు రాజ్‌భవన్ ముట్టడి

గుండాల: నీట్ పరీక్షలు రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని, ఆ నీట్‌పరీక్షను రద్దు చేయాలని కోరుతూ నేడు రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్శిక రవి ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా విద్యార్థులు ఉద్యమం చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఆ పరీక్షలు రద్దు చేసి,మళ్లీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర గవర్నర్‌ను కలవాలని, సమస్యపై చర్చించాలని కోరినా అపాయింట్మెంట్ ఇవ్వలేదని, దీంతో జూలై 1వ తేదీన వామపక్ష, విద్యార్థి, యువజన సంఘాలు ముట్టడి నిర్ణయం తీసుకున్నాయని అన్నారు. విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆలయంలో రుద్రయాగం

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీ కొండాయిగూడెం గ్రామంలో ఉన్న భ్రమరాంబ సమేత వైద్యనాథలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వైభవంగా ప్రత్యంగిరా సహిత రుద్రయాగాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకుల వేదమంత్రోచ్చరణల నడుమ భక్తులతో యాగం నిర్వహించారు. యాగ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కార్మికులు

మణుగూరురూరల్: ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవ స్ఫూర్తితో సింగరేణి సివిల్ రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు ఆదివారం కేసీహెచ్‌పీ రైల్వే ట్రాక్ సమీపంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త ఏ.మంగీలాల్ మాట్లాడుతూ.. మొక్కల పెంపకం, వాటి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు కె.గురుమూర్తి, యు.శివరామకృష్ణ, జి.నాగేశ్వరరావు, శ్రీనివాస్, బైసన్, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్రికెట్ ప్రేమికుల సంబరాలు

దుమ్ముగూడెం: 17 ఏళ్ల తర్వాత టి 20 ప్రపంచ కప్‌లో భారత్ విజయం సాధించడంతో దుమ్ముగూడెం మండల యువకులు టపాసులు పేల్చి భారతమాతాకీ జై.. జయహో భారత్ అంటూ బైక్ ర్యాలీ ఆదివారం నిర్వహించారు. జోరు వర్షం పడుతున్నా కూడా యువకులు భారత్ సాధించిన అద్వితీయమైన విజయం సాధించడంతో ద్విచక్రవాహనాలపై త్రివర్ణ పతాకం చేతబట్టి ర్యాలీ నిర్వహించారు.

వైద్యవృత్తి పవిత్రమైంది..

- ప్రజారోగ్య సంరక్షణలో కీలక పాత్ర
- వృత్తి ధర్మంలో స్వయం సంతృప్తి
- నేడు జాతీయ వైద్యుల దినోత్సవం



భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స చేస్తున్న వైద్య బృందం (ఫైల్)

భద్రాచలంఅర్బన్: దేవుడు ప్రాణాలు పోస్తే.. వైద్యులు ప్రాణాలను కాపాడతారు. అందుకే వైద్యో నారాయణో హరి అన్నారు పెద్దలు. సమాజంలో వైద్య వృత్తికి ఉన్న గౌరవం, ప్రజల ఆరోగ్యం సంరక్షణలో వారి భాగస్వామ్యం, వారి సేవలు అమూల్యమైనవి. ఎన్నో కష్టనష్టాలు ఉన్నా పవిత్రమైన వైద్య వృత్తిని దశాబ్దాలుగా కొనసాగిస్తూ ప్రజల సేవలో సంతృప్తి చెందుతున్న వైద్యులు జిల్లాలో ఎంతో మంది ఉన్నారు. బెంగాల్‌కు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ బిదన్ చంద్రారాయ్ సంస్మరణగా నేడు (సోమవారం) జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఆయన 1882 జులై 1న జన్మించారు. 1962 జూలై 1న కన్నుమూయగా 1991 నుంచి ఆ రోజును డాక్టర్స్ డేగా పాటిస్తున్నారు.

స్థానికంగా మెరుగైన వైద్యసేవలు..

ఒకప్పుడు మెరుగైన వైద్య సేవలు, పెద్ద ఆపరేషన్ల కోసం స్థానికులు రాష్ట్రంలో హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు. కానీ ఇప్పుడు ఏజెన్సీ ప్రాంతంలో అలాంటి పరిస్థితులు మారాయి. ప్రస్తుతం భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. దీనికి నిదర్శనం ప్రతి ఏడాది జిల్లాలో వరదలు రావడం, ఆ సమయంలో వైద్యులు విస్తృతంగా వారి సేవలు అందించడమే. దీంతో ఏజెన్సీ ప్రజల్లో భద్రాచలం ఏరియా ఆస్పత్రి, అక్కడ అందించే వైద్య సేవలపై నమ్మకం పెరిగింది.

గతంలో సాధారణ వ్యాధులకు మాత్రమే జిల్లాలో వైద్యులు అందుబాటులో ఉండేవారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులు అందుబాటులో ఉండేవారు కాదు. ఏజెన్సీ ప్రాంతమైన జిల్లా ప్రస్తుతం శర వేగంగా అభివృద్ధి చెందుతుండగా వైద్య సేవలు సైతం పెరిగాయి. ప్రస్తుతం భద్రాచలం ఏరియా ఆస్పత్రితో పాటు జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్పెషలిస్టులు అందుబాటులో ఉన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులనూ హంగులతో ఏర్పాటు చేస్తున్నారు.

దేవుడు ఇచ్చిన అవకాశం



జీవనం సాగించేందుకు ప్రపంచంలో ఎన్నో వృత్తులు, ఉపాధి అవకాశాలు ఉన్నాయి. అయితే వైద్య వృత్తిని మాత్రం మేము చాలా పవిత్రమైనదిగా చూస్తాం. ప్రాణాలను కబళించే రోగాలకు దగ్గరగా ఉండే వైద్యులు రోగిని కాపాడేందుకు ఎంతో శ్రమించాల్సి ఉంటుంది. ఇది భగవంతుడు మాకు ఇచ్చిన అవకాశం. తమకు వచ్చిన రుగ్మత కారణంగా ఆందోళనతో ఆస్పత్రికి వచ్చిన రోగులు.. నయమై ఆరోగ్యంగా తిరిగి వెళుతుంటారు. ఆ సమయంలో వారి కళ్లలో ఆనందం చూసి మేం ఎంతో సంతృప్తి చెందుతాం. కానీ, రోగి కోలుకున్న సందర్భంలో వైద్యుడు గొప్పవాడు, విఫలమైన సందర్భంలో వైద్యుడిది తప్పు అన్న భావన ప్రజలు విడనాడాలి.

– డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఆర్ఎంఓ, భద్రాచలం ఏరియా ఆస్పత్రి

సుఖ ప్రసవమే లక్ష్యం..



ప్రసవం కోసం భద్రాచలం ప్రభుత్వాస్పత్రికి వచ్చే ప్రతి గర్భిణికీ సుఖ ప్రసవం చేయడమే లక్ష్యంగా సేవలు అందిస్తున్నాం. ఇక్కడికి వచ్చిన వారికి ప్రసవం చేసి తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఆస్పత్రి నుంచి పంపుతున్నాం. నేను ఇక్కడ 8 నెలల క్రితం విధుల్లో చేరాను. ఇప్పటి వరకు దాదాపు 1500 మందికి ప్రసవం చేశాను, వారిలో హైరిస్క్ ప్రెగ్నెన్సీ ఉన్న 550 మందికి కూడా ఎటువంటి సమస్య లేకుండా ప్రసవం చేశాం. తల్లీ బిడ్డ ఆరోగ్యంగా డిశ్చార్జి అయ్యేటప్పుడు వారు మాపై చూపే ఆప్యాయతలు మాకు కొండంత స్థైర్యాన్ని ఇస్తాయి.

– డాక్టర్ శ్రీనిధి, స్త్రీ వైద్య నిపుణులు, భద్రాచలం ఏరియా ఆస్పత్రి

అదృష్టంగా భావిస్తున్నా..



పిల్లలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా. అందులోనూ ప్రభుత్వ సర్వీసులో పేదలకు సేవ చేయగలుగుతున్నా. అప్పుడే పుట్టిన శిశువులు బరువు తక్కువగా ఉన్నా, ఉమ్మనీరు తాగినా ఎస్ఎన్‌సీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నాం. ప్రైవేటుకు వెళ్తే రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు ఖర్చు అయ్యే వైద్యాన్ని ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా చేస్తున్నాం. అందుకు అవసరమైన సౌకర్యాలను సైతం ప్రభుత్వం కల్పించింది. ప్రభుత్వ ప్రోత్సాహంతో రూపాయి ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్యం అందించగలుగుతున్నాం.

– డాక్టర్ సుమన్, నోడల్ అధికారి, ఎస్ఎన్‌సీయూ, భద్రాచలం

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: మండల శివారు గ్రామాలలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రమైన చర్లలో ఆదివారం జరిగిన వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లోని పలు అటవీ ప్రాంత గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు వస్తుండగా వారి మాటున మావోయిస్టులు, మిలీషియా సభ్యులు, కొరియర్లు, సానుభూతిపరులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన లెనిన్‌కాలనీ, తాలిపేరు ప్రాజెక్టు, కలివేరు క్రాస్‌రోడ్, దానవాయిపేట తదితర గ్రామాల శివారు రహదార్లపై మోహరించిన పోలీసు బలగాలు సంతకు వచ్చిపోయే వారిని ఆపి నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమానితులుగా భావిస్తూ పలువురు ఆదివాసీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించి నిర్ధారించుకున్న తరువాత వారిని విడిచిపెట్టారు. చర్ల సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి నేతృత్వంలో తనిఖీలు కొనసాగగా, సివిల్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

సింగరేణి ఆస్పత్రి సందర్శన



సమస్యలను విన్నవిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఆస్పత్రిని ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ నాయకులు ఆదివారం సందర్శించి పరిశీలించారు. ఆస్పత్రిలో వైద్యచికిత్సలు పొందుతున్న వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.కృష్ణంరాజు మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు, దోమల మందు పిచికారి వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఏపుగా ఎదిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని, పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. సింగరేణి ఆస్పత్రిలో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. అలాగే ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆ మేరకు ఆస్పత్రి ఉపముఖ్య వైద్యాధికారి మేరికుమారికి విన్నవించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి సిల్వేరు గట్టయ్య, మొహమ్మద్ షాబుద్దీన్, సంతోష్ చరణ్, రాము, రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భజనమండలి సభ్యుల ప్రదర్శన

దుమ్ముగూడెం: మండలంలోని రేగుబల్లి గ్రామానికి చెందిన పాండవకృష్ణా భజన మండలి బృందం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పాల్వంచ సీతారామ కల్యాణ మండపంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా భజన బృందం సభ్యులు మంచి పాటాలను ఆలపించారు. అలాగే సీతానగరం గ్రామానికి చెందిన కొమరం దామోదరరావు వీరపాండ్య కట్టబ్రహ్మన పాత్రలో జీవించారు.అనంతరం సభ్యులకు మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెట్టి వెంకటరాజు, రాణి, సావిత్రి, మౌనిక, జానికమ్మ, అచ్చమ్మ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ ట్రాక్టర్.. చెత్తపాలు!

అశ్వారావుపేటరూరల్: విధుల్లోని చెత్తచెదారాన్ని సేకరించి డంపింగ్ యార్డులకు తరలించేందుకు గ్రామ పంచాయతీకు అందించిన ఓ స్వచ్ఛ ట్రాక్టర్ లక్ష్యం చెత్తపాలైంది. వివరాలిలా ఉన్నాయి. అశ్వారావుపేట మండలం పాత రెడ్డిగూడెం గ్రామ పంచాయతీకు గత ప్రభుత్వ హయంలో సుమారు రూ.7లక్షల వ్యంతో స్వచ్ఛ ట్రాక్టర్‌ను అందించారు. ఈ ట్రాక్టర్‌కు ఖరీదైన జీపీఎస్ పరికారాన్ని సైతం అమర్చారు. కాగా గడిచిన మూడు నెలలు ఈ స్వచ్ఛ ట్రాక్టర్ మరమ్మతులకు గురి కావడంతో ట్రక్కులో చెత్తచెదారాన్ని అలానే ఉంచి, మూలకు చేర్చారు. చిన్నపాటి రీపేరు చేయించడంలో నిర్లక్ష్యం చేయడంతో లక్షలాధిరూపాయాల విలువ చేసే ట్రాక్టర్ తుప్పు పట్టి, శిథిలం అవుతోంది. ఐనా సరే పంచాయతీ అధికారులకు పట్టడం లేదు. రోజు గ్రామంలో సేకరించాల్సిన చెత్తచెదారాన్ని కూడా తొలగించడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సబితను 'సాక్షి' వివరణ కోరగా.. రిపేరు రావడంతో ట్రాక్టర్‌ను పక్కన పెట్టామని, రిపేరు చేయించేందుకు నిధులు లేవని అన్నారు. దీంతో చెత్త సేకరణ కూడా చేయలేదని చెప్పారు.



చెత్తతోనే మూలన పెట్టిన ట్రాక్టర్ ట్రక్కు